సాక్షి శ్రీకాకుళం

శనివారం । 30 । నవంబర్ । 2024



ఎదురుచూపులకు ఏడాది

గార ఎస్‌బీఐ బంగారం కేసుకు ఏడాది ఫైబడింది. కేసు ఇంకా కొలిక్కి రాలేదు.

- 8లో



బాధితులకు సంఘీభావం

కార్గో ఎయిర్‌పోర్టు బాధితులకు సంఘీభావం దొరుకుతోంది. ప్రజా సంస్థల నాయకులు అండగా ఉంటున్నారు.

- 8లో

ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలుగా వినాయకం, గడ్డెమ్మ

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంస్థ(ఎస్సీ కార్పొరేషన్) ఈడీగా డిప్యూటీ కలెక్టర్ వి.వినాయకంను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్.గడ్డెమ్మ ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈమెను బీసీ కార్పొరేషన్ ఈడీగా నియమించారు.

న్యూస్‌రీల్

స్పాట్ అడ్మిషన్లకు అరకొర స్పందన

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు శుక్రవారం నిర్వహించారు. అయితే దీనికి స్పందన కరువైంది. 20 మంది విద్యార్థులు కూడా హాజరు కాలేదు. కొందరు ఫీజుస్ట్రక్చర్ తెలుసుకొని వెళ్లిపోయారు. వర్సిటీలో 315 సీట్లు ఖాళీ ఉండగా, నిబంధనలు సడలించి ప్రవేశాలు కల్పించినా స్పందన లభించలేదు. ఏపీ పీజీ సెట్ అర్హత సడలించారు. డిగ్రీ అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. ప్రభుత్వ రాయితీలు వర్తించక పోవటంతో ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు ఆసక్తి చూపించారు. ప్రిన్సిపాళ్లు అనురాధ, ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు.

చెత్త సేకరణతోనే గ్రామాల అభివృద్ధి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్: చెత్త సేకరణతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని రాగోలు పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎక్కువగా వర్మీ కంపోస్టును తయారు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం సుందరీకరణకు సీఆర్ఎస్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. వర్మీ కంపోస్టును విక్రయించేందుకు కేంద్రం బయట స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన సిబ్బంది ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య, ఎంపీడీఓ బొడ్డేపల్లి పద్మజ, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి, స్థానిక సర్పంచ్ గేదెల చెంగల్వరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు



బెట్‌పోస్ట్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు సూచనలు ఇస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం అర్ధరాత్రి జిల్లాకేంద్రంలోని కొన్ని కీలకప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రధానంగా రిమ్స్ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ కేంద్రంగా ఉన్న ఔట్‌పోస్టులో తమ కానిస్టేబుళ్ల విధులను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లకు తగు సూచనలు చేశారు. అంతేకాక పాలకొండ రోడ్డులో ఉన్న కృష్ణాపార్కు వద్ద రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల వద్దకు వెళ్లి బీట్ నిర్వహణపై ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులు, పాత నేరస్తులు తారసపడితే వారి కదలికలను పసిగట్టి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.





పింఛన్ల పంపిణీ కోసం శుక్రవారం స్టేట్‌బ్యాంకు నుంచి రూ.29.63లక్షల నగదు విత్‌డ్రా చేసుకుని వెళ్తుండగా రాజీవ్ స్వగృహ కాలనీ వద్ద ఎస్ఎంపురం వేల్ఫేర్ అసిస్టెంట్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ఇనుప రాడ్‌తో దాడి చేసేందుకు యత్నించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ చాకచక్యంగా తప్పించుకుని, సురక్షితంగా బయటపడ్డారు. లేదంటే ప్రాణానికి హాని జరిగేది.



ప్లాన్ లేకుండా అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్న వ్యక్తికి నోటీసు ఇచ్చేందుకు వెళ్లిన సచివాలయం అసిస్టెంట్‌పై కీలక ప్రజాప్రతినిధి అడ్డు తగలడమే కాకుండా అవమానపరిచారు. అక్రమంగా నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి ఇవ్వాల్సిన నోటీసును లాక్కొని, అందరి ముందు చించేసి అధికార దర్పం చూపించారు. దీంతో ఆ ఉద్యోగి అవమానభారంతో వెనుదిరిగారు.



ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలి వ్యవసాయ సహాయకుడు మురళి పింఛన్లు పంపిణీ చేసేందుకు వస్తుండగా ఎచ్చెర్ల సమీపంలో బైక్‌పై నుంచి పడిపోయాడు. తెల్లవారు జామున ఆమదాలవలస నుంచి ఫరీదు పేట వస్తుండగా వ్యవసాయ సహాయకురాలు రేవతి కూడా ఆమదాలవలస వంతెన వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఇలా పని ఒత్తిడిలో ప్రమాదాలకు గురైన సచివాలయ ఉద్యోగులెందరో..

వేధింపులు.. కక్ష సాధింపులు

- పని భారం పెంచేసి టార్చర్ పెడుతున్న ప్రభుత్వం
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న సచివాలయ ఉద్యోగులు
- కూటమి నాయకుల తీరుతో అడుగడుగునా అవమానాలు
- ప్రక్షాళన పేరుతో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

సచివాలయ ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సచివాలయ ఉద్యోగులపై సర్కారు కక్ష పెట్టుకున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వం మారాక సచివాలయ ఉద్యోగులకు అన్నింటా వేధింపులే ఎదురవుతున్నాయి. పెరిగిన పని ఒత్తిడితో మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. విధినిర్వహణలో రకరకాల ఆలోచనలు, టెన్షన్లతో ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులను కూటమి నాయకులు చిన్న చూపు చూడటమే కాకుండా జనాల మధ్యన నిలబెట్టి తీవ్రంగా అవమాన పరుస్తున్నారు.

కనుమరుగయ్యేలా..

గడిచిన ఐదేళ్లలో రికార్డు అసిస్టెంట్ స్కేల్ జీతంతో సేవలు అందిస్తున్న శాఖగా గ్రామ వార్డు, సచివాలయ శాఖ గుర్తింపు తెచ్చుకుంది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను చేర్చడంలో కీలకంగా వ్యవహరించింది. పరిపాలనలో గొప్ప సాధనంగా మారిన ఇలాంటి శాఖ నేడు కనుమరుగయ్యే పరిస్థితి కనబడుతోంది. అంచలంచెలుగా ఇందులోని ఉద్యోగులను తగ్గిస్తూ మాతృశాఖకు పంపిస్తున్నారు. ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరు చూసి ఉద్యోగులు కలత చెందుతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత సచివాలయం మౌలిక వసతుల కల్పనను పూర్తిగా కూటమి ప్రభుత్వం విస్మరించింది. సచివాలయాల భవనాల నిర్మాణాలు నిలిపేసి కనీస వసతుల్లేని పంచాయతీ భవనాల్లో కొనసాగిస్తున్నారు.

సర్వేలతో ఉక్కిరిబిక్కిరి..

హౌస్ జియో ట్యాగింగ్ సర్వే, ట్యాప్ సర్వే, మరుగుదొడ్ల సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, ప్రజా ఫిర్యాదులపై వెరిఫికేషన్(పీజీఆర్ఎస్) సర్వే, ఎన్‌పీసీఐ లింక్(బ్యాంకు లింక్)ప్రభుత్వ స్టిక్కర్లు అంటించడం వంటి కార్యక్రమాలన్నీ సచివాలయం ఉద్యోగుల చేత చేయిస్తున్నారు. ఒకే సారి నాలుగైదు సర్వేలు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయపాలన లేకుండా సర్వేలు చేయించడమే కాకుండా.. టార్గెట్‌లు ఇచ్చి ఒత్తిడి చేస్తున్నారు.

ఇష్టానుసారం బదిలీలు..



సచివాలయ ఉద్యోగుల బదిలీలైతే ఇష్టానుసారంగా చేస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్ అని చెప్పి నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు బదిలీలు చేసి కక్ష సాధించుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లను బలవంతంగా బదిలీ చేశారు. మిగిలిన వారిని కూడా బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికీ ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయలేదు. సచివాలయం సిబ్బందిపై అజమాయిషీ కోసం కూటమి నేతలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపుల్లో ఎక్కడికక్కడ పింఛన్లు నిలిపివేయాలని సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు.



సచివాలయ వ్యవస్థే టార్గెట్..

సచివాలయ వ్యవస్థే టార్గెట్‌గా ప్రభుత్వం పని చేస్తున్నట్టు స్పష్టమవుతోంది. వైఎస్ జగన్ మార్క్ ఉండకుండా అస్తవ్యస్తం చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను దాదాపుగా వలంటీర్లుగా మార్చేసి అన్ని రకాల పనులు వారికే చెబుతున్నారు. సర్వేల పేరుతో నిత్యం ఇంటింటికీ తిప్పుతున్నారు. ఇంత పని చేయించుకుని జనం ముందే అవమాన పరుస్తున్నారు. దీంతో జిల్లాలో 7,800 మంది ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఒత్తిడిలో ఉద్యోగులు..



ఒకవైపు సర్వే శాఖ కేటాయించే విధులు, మరోవైపు తహసీల్దార్ కార్యాలయం అప్పగిస్తున్న అదనపు బాధ్యతలు, ఇంకోవైపు సర్వే పనులు, సంక్షేమ పథకాల అమలు బాధ్యతలు ఇవన్నీ ఒకే సమయంలో చేయిస్తున్న పరిస్థితి. ఏకకాలంలో విధులన్నీ నిర్వహించాలని షరతులు పెడుతున్నారు. దీంతో గ్రామ సర్వేయర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. మహిళలైతే మరింత ఇబ్బందులు పడుతున్నారు. అలాగని ఉద్యోగుల సంక్షేమం చూస్తున్నారా? అంటే అదీ లేదు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సర్వే సిబ్బందికి ఇచ్చే టీఏ, డీఏలను సంబంధిత డీడీఓల ద్వారా బిల్లు పెట్టుకునే అవకాశం కల్పించడం లేదు. ఐదేళ్లు సర్వీసుపూర్తి చేసుకున్న వారికి పదోన్నతిపై స్పష్టత ఇవ్వడం లేదు.

– బూరాడ మధుబాబు, రాష్ట్ర అధ్యక్షులు, గ్రామ సర్వేయర్ల సంఘం


బెదిరింపులు నిత్యకృత్యం



అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారు. పశు సంవర్ధక శాఖ సహాయ ఉద్యోగులు పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలో ఉండటం వల్ల డీడీఓగా వ్యవహరిస్తున్న వారు కేటాయించిన పనులు పూర్తి చేయకపోతే జీతాలు నిలుపుదల చేస్తామని బెదిరిస్తున్నారు. అదే సమయంలో తమ శాఖ పనులు పూర్తి చేయకపోతే మెమో జారీ చేస్తామని మాతృశాఖ అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారు. సిబ్బందికి అత్యవసరమైతే సెలవు మంజూరు చేయడానికి ఇరు శాఖలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయి.

– కేవీ రాజేష్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు, పశు సంవర్ధక శాఖ సహాయ ఉద్యోగుల సంఘం

పెరిగిన అజమాయిషీ



- సచివాలయ సిబ్బంది ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల వేధింపులతో పెద్ద ఎత్తున ఒత్తిడికి గురవుతున్నారు. సంబంధం లేని పనులు అప్పగించి, టార్గెట్లు పెట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.
- వేకువ జామునే పింఛన్ల పంపిణీ కోసం వెళ్లడానికి మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పంపిణీ రోజుల్లో గ్రామాల్లో బస చేయడం వారికి కష్టతరంగా మారింది.
- పింఛన్ పంపిణీలో ఉదయం 5గంటలకే ప్రారంభించాలని చెప్పడంతో మహిళా ఉద్యోగులు మంచు, చీకటి ప్రయాణంలో ప్రమాదాలకు గురవుతున్నారు.
- బీఎల్ఓ డ్యూటీల పేరుతో ఆదివారాల్లో కూడా సెలవు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారు.
- ఒక్కో సచివాలయ సిబ్బందిపై నాలుగైదు శాఖల అధికారులు అజమాయిషీ చేస్తున్నారు.
- మండల, మున్సిపల్ కేంద్రాల్లోని జూనియర్ అసిస్టెంట్‌ల నుంచి ఉన్నతాధికారుల వరకు సచివాలయం సిబ్బందిపై చిన్న చూపు చూస్తున్నారు.
- లైన్ డిపార్ట్‌మెంట్ ఒకరు, డీడీఓ(సాలరీ పెట్టేది) ఒకరు కావడంతో అధికారులు పెడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలపై భారాన్ని మోపే విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయడంతో పాటు స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి, సీపీఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిక్కాల గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ప్రజలపై విద్యుత్ భారాలు వేయవద్దు' అనే అంశంపై శుక్రవారం శ్రీకాకుళం ఎన్‌జీవో హోమ్‌లో వామపక్ష నేతల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే ఆపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని చెప్పారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌లో బ్యాలెన్స్ అయిపోగానే పేదలకు అంధకారమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్ ఏర్పాటుకు అయ్యే ఖర్చును 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారం కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, కె.సూరయ్య, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

పాముకాటుతో అయ్యప్ప భక్తుడు మృతి



అనంతరావు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని కుద్దిరాం గ్రామానికి చెందిన బండి అనంతరావు(50) అనే రైతు పాము కాటుతో మృతి చెందాడు. అనంతరావు అయ్యప్ప స్వామి మాల ధరించాడు. గురువారం తన వరి పొలంలో యంత్రంతో కోత కోసేందుకు ఒక్కడే వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయంత్రం రావికండిపేటలోని సన్నిధానానికి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. శుక్రవారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో పొలానికి వెళ్లి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. కాలుపై పాము కాటు వేసిన గుర్తులు ఉండటంతో మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు తెలియజేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరావుకు భార్య అన్నపూర్ణమ్మ, కుమారుడు సాయి, కుమార్తె ప్రియాంక ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరయ్యారు.



పెద్ద పులి మళ్లీ వచ్చింది

- గత ఏడాది జిల్లాలో సంచరించి ఒడిశా వైపు వెళ్లిన పెద్ద పులి
- ఇప్పుడు ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ప్రవేశం
- కోటబొమ్మాళి మండలం పొడుగుపాడులో పెద్దపులి ఆనవాలు



పంట పొలాల్లో పెద్ద పులి అడుగులు

టెక్కలి: గత ఏడాది సరిగ్గా ఇదే నవంబర్ నెలలో ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ప్రవేశించిన పెద్ద పులి మళ్లీ ఇప్పుడు మరో సారి అలజడి సృష్టిస్తోంది. గత రెండు రోజుల నుంచి టెక్కలి, కాశీబుగ్గ డివిజన్‌ల పరిధిలో పలు ప్రాంతాల్లో సంచరిస్తూ ఆ యా గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. శుక్రవారం కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామం సమీపంలో పెద్దపులి అడుగుల ఆనవాలు కనిపించడంతో అటవీ శాఖాధికారులు ఆ ప్రాంతానికి పరుగులు తీశారు. గత రెండు రోజులుగా పెద్దపులి ఈ ప్రాంతంలో గల గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఒక వైపు తుఫాన్ ప్రభావంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పంట పొలాల్లో ముమ్మరంగా కోత లు, నూర్పులు చేస్తున్న సమయంలో పెద్దపులి సంచారంపై అధికారుల హెచ్చరికలతో రైతులు మరింత భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖా ఎఫ్ఆర్ఓ జగదీశ్వరరావు, ఏసీఎఫ్ నాగేంద్ర, బీట్ అధికారులు జనప్రియ, రంజిత్, ఝూన్సీ తో పాటు సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తత చర్యలు చేపడుతున్నారు.



కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో పెద్ద పులి ఆనవాలు పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

ప్రస్తుతం భయాందోళనకు గురి చేస్తున్న పెద్దపులి ఒడిశా నుంచి మందస రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా సాబకోట, బుడంబో తదితర గిరిజన ప్రాంతాలను దాటుకుంటూ వజ్రపుకొత్తూరు తీర ప్రాంతంలో గల తోటల నుంచి సంతబొమ్మాళి వైపునకు చేరుకుంది. ప్రస్తుతం కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు సమీపంలో పెద్దపులి ఆనవాలు కనిపించాయి.

పులి సంచారంపై అప్రమత్తం

పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖాధికారులు అప్రమత్తత చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొన్ని రకాల జాగ్రత్తలు దండోరా ద్వారా తెలియజేస్తున్నారు.

- ప్రజలు వేకువజామున, చీకటి పడిన తర్వాత సాధ్యమైనంతవరకు బయట తిరగకుండా ఇళ్ల వద్ద ఉండాలి.
- ఇంటి ఆరుబయట లేదా పశువుల పాకల వద్ద నిద్రించకూడదు.

అప్రమత్తంగా ఉండాల్సిందే..

- పులి తిరుగుతున్న ప్రాంతంలో అడవి లోపలకు వెళ్లేందుకు సాహసించకూడదు.
- వ్యవసాయ పనులు, బయటకు వెళ్లినపుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలి.
- వ్యవసాయ పనుల్లో కింద కూర్చున్నప్పుడు లేదా వంగి పని చేస్తున్నపుడు అప్రమత్తంగా ఉండాలి.
- పంట పొలాలకు వెళ్లినపుడు బిగ్గరగా శబ్దాలు చేయాలి.
- పులులు సంచరించే ప్రాంతాల్లో పశువులను బహిరంగ ప్రదేశాల్లో ఉంచకూడదు.
- పులి తిరుగుతున్న ఆనవాళ్లు, పాదముద్రలు కనిపిస్తే తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో అటవీశాఖాధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడైనా పులి సంచరించే ఆనవాలు కనిపిస్తే తక్షణమే...
6302267557, 9440810037,9493083748
ఫోన్ నంబర్లకు సమాచారం అందజేయాలి.

అమ్మో.. వాన



నరసన్నపేట: బై పాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

చినుకు నిలువునా వణికించేసింది.

పెంగల్ ప్రభావంతో జిల్లాలో పడిన జల్లులకు రైతుల గుండె గుబేల్‌మంది. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా ఆగమేఘాలపై టార్పాలిన్లు కప్పుకున్నారు. పొలాల్లో హడావుడిగా కుప్పలు పెట్టారు. కళ్లాల్లోని ధాన్యాన్ని కూడా టార్పాలిన్లతో కప్పారు. సముద్ర తీరాల్లో వలలు, తెప్పలను తీరానికి తీసుకువచ్చేశారు.



ఎచ్చెర్లలో వరిపై కవర్లు వేస్తున్న రైతులు



మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామం వద్ద పొలంలోనే వర్షానికి తడిసిన వరి ఓవులు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి ప్రాంతంలో చినుకులు పడుతున్నా కుప్పలు పెడుతున్న రైతులు



వజ్రపుకొత్తూరు: వలలు, తెప్పలను ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు



మెళియాపుట్టి: పట్టుపురంలో కళ్లాల్లోని ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి జాగ్రత్త చేస్తున్న రైతులు



ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట తీరంలో బోట్లు



జి.సిగడాం: జి.సిగడాం- గొబ్బూరు గ్రామాల మధ్యలో వరికుప్పలకు రక్షణ చర్యలు

క్లుప్తంగా

కూర్మనాథుని సేవలో జీయర్ స్వామి



ఆలయ సన్నిధిలో స్వామీజీ

గార : ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాథున్ని మేల్కొట అస్థానం నలభై ఒకటో పీఠాధిపతి యతిరాజ జీయర్ స్వామీజీ శిష్య బృందంతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు సీహెచ్.సీతారామ నృసింహాచార్యులు, ఈవో గురునాథరావులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. మూలవిరాట్, లక్ష్మీదేవిని దర్శించుకున్న అనంతరం స్వామికి చిత్రపటాన్ని అందజేశారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ పరిసర ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. పలాస తహశీల్దారు కళ్యాణచక్రవర్తి నేతృత్వంలో అధికారులు పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51లో స్థలాన్ని పరిశీలించారు. పలాస కిడ్నీ ఆసుపత్రి నుంచి సూదికొండ పరివాహక ప్రాంతాన్ని సర్వేచేయించారు. కార్యక్రమంలో సర్వేయర్ గిరిప్రసాద్, ఆర్ఐ ఖగేష్‌నాయుడు, వీఆర్‌ఓ నౌషద్, జుబీర్, ఉషా పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

నరసన్నపేట: మండలంలోని దేవాది సమీపంలో వల్లభరాయునిపేట చెరువు గట్టు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం ఉదయం సీఐ జె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని పట్టుకుని వారి నుంచి రూ.87,100 నగదు, రెండు కార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108లో ప్రసవం



బిడ్డతో సిబ్బంది

కవిటి : మండలంలోని కపాసుకుద్ది మత్స్యకార గ్రామానికి చెందిన నిండు గర్భిణి జి.లలితకు గురువారం అర్ధరాత్రి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకున్న108 సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని మార్గమధ్యలోనే ఆపి డెలివరి చేసేందుకు ప్రయత్నించారు. సమస్య తీవ్రం కావడంతో ఈ.ఎం.టి.కృష్ణారావు, ఈ.ఆర్.సి.పి డాక్టర్ సందీప్ సూచనలతో జాగ్రత్తగా ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం ఇచ్ఛాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

● నెమలి పింఛంపై గురజాడ



చిత్రకారుడు రాహుల్

నెమలి పింఛంపై గురజాడ చిత్రాన్ని తీర్చిదిద్ది శ్రీకాకుళానికి చెందిన వాడాడ రాహుల్ ఔరా అనిపించాడు. గురజాడ 109వ వర్ధంతి సందర్భంగా ఈ చిత్రాన్ని నెమలి పింఛంపై గీసినట్లు రాహుల్ తెలిపారు

– శ్రీకాకుళం కల్చరల్



ఎదురుచూపులకు ఏడాది!

- కొలిక్కి రాని గార ఎస్‌బీఐ బంగారం స్కామ్
- నేటికీ ఖాతాదారులకు చేరని రికవరీ బంగారం
- కొనసాగుతున్న విచారణ

శ్రీకాకుళం క్రైమ్ :

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐ స్కామ్ వెలుగుచూసి ఏడాది పూర్తయినా కేసు కొలిక్కి రాకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.4.7 కోట్ల విలువైన 7.146 కిలోల తనఖా బంగారాన్ని బ్యాంకుకే చెందిన అధికారులు, సిబ్బంది మాయం చేశారన్న ఆరోపణలు రావడంతో అనేక నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు అప్పట్లోనే బంగారాన్ని రికవరీ చేశారు. అయినా ఇప్పటికీ ఆ బంగారం ఖాతాదారులకు చేరకపోవడం గమనార్హం. అప్పట్లో ప్రారంభమైన దర్యాప్తు సగంలోనే ఆగిపోవడం, మరళా రీ-ఇన్వెస్టిగేషన్ ప్రారంభమైనా ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ విషయం..

గతేడాది నవంబరు 23న గార ఎస్‌బీఐ క్యాషియర్ ముంజి సురేష్‌పై దాడి జరిగింది. అయితే బ్యాంకులో తనఖా బంగారం మాయం చేసిన విషయం బయటకు పొక్కుతుందేమోనని బ్యాంకు అధికారి స్వప్నప్రియే దాడి చేయించిందంటూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆ మరుసటి రోజు (24వ తేదీ)న ఫిర్యాదు చేశాడు. అనంతరం బంగారం మాయం కేసులో స్వప్నప్రియే ప్రధాన నిందితురాలు అని దుష్ప్రచారాలతో కూడిన కథనాలు రావడంతో అవమాన భారంతో 29వ తేదీన ఆమె ఆత్మహత్య చేసుకుంది. దీంతో అప్పటివరకు బంగారం మాయమవ్వలేదని బీరాలు పలికిన బ్యాంకు అధికారులు, ఆ మరుసటి రోజే తనఖా బంగారం మాయమైందని, చనిపోయిన స్వప్నప్రియ, ఆమె సోదరుడిపైన ఫిర్యాదు చేశారు. తర్వాత అప్పటి ఎస్పీ రాధిక సమక్షంలోని పోలీసులు రంగప్రవేశం చేసి విచారణలో తొమ్మిదిమంది నిందితులను గుర్తించి డిసెంబరు 8న ఏడుగురిని అరెస్టు చేసి బంగారాన్ని రికవరీ చేసి కోర్టుకు అప్పగించారు. అయితే ఆ కుంభకోణంలో తమ కుటుంబాన్ని ఇరికించారని, కుమార్తె ప్రాణాన్ని బలిగొన్నారని స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ జాతీయ మానవహక్కులు, మహిళా కమిషన్, ప్రస్తుత హోంమంత్రి, సీఎంవో కార్యాలయాలకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు కథ మళ్లీ మొదలైంది. కుంభకోణం చేయించింది అప్పటి రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజేననని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కొత్త ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రంగంలోకి దిగి డీఎస్పీ వివేకానందతో రీ-ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టించారు. దీనిలో భాగంగా ఇప్పటికే 15 మందికి పైగా అనుమానితులను పోలీసులు పలుమార్లు పిలిచి విచారించడం, నివేదికలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు (ఎస్పీ, డీఐజీ, ఐజీ స్థాయి) చేరవేశారు.



గార ఎస్‌బీఐ కార్యాలయం వద్ద ఖాతాదారుల ఆందోళన(ఫైల్)

బాధితుల ఆందోళన..

పోలీసులు రికవరీ చేసిన తమ బంగారాన్ని ఇప్పటివరకు బ్యాంకు వారు అందివ్వలేదని, దీనికితోడు వడ్డీలు కట్టాలంటూ మెసేజ్‌లు, ఫోన్‌లు వస్తుండటంతో ఇటీవల బాధితులు ఆందోళన చేపట్టారు. వాస్తవానికి పోలీసులు రికవరీ చేసిన బంగారం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున అవి బ్యాంకు సేఫ్‌లో ఉన్నట్లేనని, బంగారం ఇప్పించే బాధ్యత తమదేనని.. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్‌బీఐ వర్గాలంటున్నాయి. తాజాగా దీనిపై బ్యాంకు అధికారులు న్యాయసలహాదారుల సమక్షంలో ఖాతాదారులతో సమావేశమై ఈ విషయం చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు.



● రాజును విధుల నుంచి తొలగించాలి

- నా కుమార్తెలా ఎంతోమంది ప్రాణాలు పోతాయి
- ప్రస్తుత ఆర్‌ఎంకు వినతిపత్రం అందించిన స్వప్నప్రియ తల్లి

శ్రీకాకుళం క్రైమ్ : గతేడాది నవంబరులో గార ఎస్‌బీఐ బ్రాంచిలో నగలు మాయమవ్వడం వెనుక అప్పటి జిల్లా రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజు పాత్ర ఉందని, బ్యాంకు అధికారులను తప్పుదోవ పట్టించిన ఆయన్ను విధుల నుంచి తొలగించాలని ఆత్మహత్యకు పాల్పడిన బ్యాంకు ఉద్యోగిని ఉరిటి స్వప్నప్రియ తల్లి సరళ కోరారు. స్వప్నప్రియ చనిపోయి ఏడాది కావడంతో ఆమె శుక్రవారం ఉదయం జిల్లాకేంద్రంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న శ్రీకాకుళం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ వ్యాపార కార్యాలయంలో ప్రస్తుత రీజనల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎక్స్ ఆర్‌ఎం రాజును బర్తరఫ్ చేయాలంటూ కార్యాలయం బయట ప్లకార్డు ప్రదర్శించారు. ఆమె వెంట బంధువులు ఉన్నారు.

వినతిపత్రంలో ఏముందంటే..

'ఎస్బీఐలో క్లర్క్ ఉద్యోగం చేస్తున్న స్వప్నప్రియకు పదోన్నతి రావడంతో 2022లో గార బ్రాంచిలో డిప్యూటీ మేనేజరుగా పోస్టింగ్ ఇచ్చారు. 2023 నవంబరులో బ్యాంకు లాకరులో ఉన్న బంగారు నగలు మాయమైతే. అప్పటి రీజనల్ మేనేజ్ ఎటువంటి ఆధారాలు లేకుండా స్వప్నప్రియ మీద ప్రచారం చేయడంతో పాటు పత్రికలు, సోషల్ మీడియాకు సమాచారం అందించారు. దీంతో మనస్థాపానికి గురై అదే నెల 29న స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది. చనిపోయిన తర్వాత కూడా ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు నా కుమారుడిని పోలీసులు నిందితుడిగా చూపించి రిమాండ్‌కు పంపించారు. బంగారం పోయిందంటూ ఆరోపణలు వచ్చిన నెలరోజుల ముందే ఆడిట్ జరిగిందని, అంతా సవ్యంగానే ఉందని చెప్పిన ఆర్‌ఎం రాజు స్వప్నప్రియ చనిపోయాక ఆమెపై మాత్రమే నింద నెట్టి మిగతా వారిని రక్షించారు. ఆమె దహన సంస్కార ఖర్చులు సైతం ఇప్పించలేదు. కనీసం సహచర సిబ్బంది పరామర్శించడానికి వస్తామన్నా రానివ్వలేదు. మా కుటుంబాన్ని హింసించి, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా చితికి పోయేలా పరిస్థితి తీసుకొచ్చిన ఆర్‌ఎం రాజు ఇప్పటికీ విధుల్లో కొనసాగితే స్వప్నప్రియ మాదిరి ఎంతో మంది ఉద్యోగుల ప్రాణాలు పోతాయి..' అని సరళ పేర్కొన్నారు.



జిల్లా ఎస్‌బీఐ ప్రాంతీయ వ్యాపార కార్యాలయం ఎదుట ప్లకార్డుతో స్వప్నప్రియ తల్లి సరళ

● నేటి నుంచి బైపీసీ స్ట్రీమ్

ఏపీఈఏపీ సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్-2024 బైపీసీ స్ట్రీం కౌన్సెలింగ్ శనివారం నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదర్‌రావు, సహాయ కేంద్ర కోఆర్డినేటర్ డి.మురళీకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. వెబ్ ఆధారిత పద్ధతిలో కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు. బైపీసీ స్ట్రీమ్‌లో ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ, బీటెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్, బి.ఫార్మసీ, ఫార్మాడీ వంటి కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయని అన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్ ఫీజులు చెల్లింపు, డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, డిసెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల రిజిస్ట్రేషన్, 8న ఆప్షన్లు మార్పు, 11న సీట్ల అలాట్‌మెంట్, 11 నుంచి 14వ తేదీ మధ్య కళాశాలలకు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు తగదు

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల పనివేళల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలువురు తల్లిదండ్రులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ దృష్టికి తీసుకొచ్చారు. రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రామకృష్ణారావు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీపాన రామన్న, దుంపల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



రొట్టవలస హైస్కూల్ అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

జోరువానలో నిరసన

- ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళంలో మాలల భారీ ర్యాలీ
- ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేయాలని డిమాండ్



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించిన మాలలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళంలో మాలలు కదం తొక్కారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పోరాట సమితి గౌరవ సలహాదారులు కళ్లేపల్లి రామ్ గోపాల్ ర్యాలీని ప్రారంభించారు. ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, వర్గీకరణకు మద్దతు పలికిన ఏ రాజకీయ పార్టీ అయినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తూ ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. అలాగే ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని, పార్లమెంట్‌లో చట్టం చేయాలని, వర్గీకరణకి వ్యతిరేకంగా మాల ప్రజాప్రతినిధులు చట్ట సభల్లో గళం విప్పాలని కోరారు. ర్యాలీ అనంతరం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో కన్వీనర్ డాక్టర్ కంఠ వేణు ప్రతినిధులు బడే కామరాజు, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్ తదితరులు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

అనంతరం డచ్ బంగ్లా వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఒక వైపు జోరు వాన కురుస్తున్నా అధిక సంఖ్యలో జనం సభలో పాల్గొన్నారు. పీఎస్ఎస్ మూర్తి, మల్లెల వెంకటరావు, మంచె నాగమల్లేశ్వరి, బొడ్డేపల్లి నరసింహులు, పాల్తేటి పెంటారావు తదితరులు మాట్లాడుతూ మాలలంతా వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రాజకీయ లబ్ధి కోసం ఎస్సీలను వర్గీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం వడివడిగా అడుగులు వేస్తోందని, మాలలంతా ఐక్యంగా వాటిని వ్యతిరేకించాలని కోరారు. మనువాద రాజకీయ పార్టీలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. వర్గీకరణను ఒక్క మాదిగలు మాత్రమే స్వాగతిస్తున్నారని మిగతా షెడ్యూల్ కులాలు, తెగలు వారంతా పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. భారత పార్లమెంట్ లో షెడ్యూల్డ్ కులాలు, తెగలకి సంబంధించి 109 మంది ఎంపీలు ఉన్నారని వారంతా దళిత, గిరిజనులకి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యజ్జల గురుమూర్తి, రాకోటి రాంబాబు, గురువులు, పాపారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ ట్రైనింగ్ రద్దు చేయాల్సిందే

కవిటి: విజయనగరం జిల్లా గజపతినగరంలో ఇటీవల జరిగిన లీడర్‌షిప్ ట్రైనింగ్ కేంద్రంలో భామిని మండలం నేరడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిపురం శ్రీనివాసరావు గుండెపోటుతో చనిపోవడం అత్యంత దారుణమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీ ప్రకాష్ అన్నారు. శుక్రవారం ఈ మేరకు కవిటిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూటీఎఫ్ నేతలు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుని కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు తీవ్ర ఒత్తిడిలోకి నెడుతున్న లీడర్ షిప్ రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసురావు మృతిపై ఉన్నత స్థాయి విచారణ జరిపి అందుకు కారణమైన వారిపై చర్యలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు మురళీ ప్రకాష్ తదితరులు

గ్యాస్ మంటలు చెలరేగి వృద్ధురాలి మృతి



అరటి ఆకుపై బాధితురాలు

కొత్తూరు: మండలంలోని కడుము కాలనీకి చెందిన పొందర కమలమ్మ(75) అనే వృద్ధురాలు గ్యాస్ ప్రమాదంలో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలమ్మ గురువారం రాత్రి చిన్న కుమారుడి ఇంట్లో భోజనం చేసి సమీపంలో తాను ఉంటున్న ఇంటికి వచ్చింది. గ్యాస్ స్టవ్‌పై వేడినీరు పెట్టి కొద్దిసేపటి తర్వాత స్టవ్ ఆపకుండానే తలుపులు వేసుకొని నిద్రపోయింది. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో నిద్ర లేచి లైట్ వేసేందుకు స్విచ్ ఆన్ చేసింది. అప్పటికే ఇంటి మొత్తం గ్యాస్ వ్యాపించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కమలమ్మ కేకలు వేయడంతో కుమారుడితో పాటు ఇరుగుపొరుగు వారు వచ్చి బయటకు తీసుకొచ్చారు. తీవ్ర గాయాల పాలైన కమలమ్మను 108 అంబులెన్సులో కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కమలమ్మ మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ చెప్పారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

హిరమండలం: మండలంలోని లోకొండ పంచాయతీ గోడియాపాడు గిరిజన గ్రామంలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో భాస్కరరావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో వస్తువులతో పాటు నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. గ్రామస్తులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

● ఉమాజఠలేశ్వరుడికి అన్నాభిషేకం



శ్రీకాకుళం నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

పాడి రైతుల ధర్నా

రణస్థలం: విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను పెంచాలని రైతు సంఘం నేత వెలమల రమణ డిమాండ్ చేశారు. పాడిరైతుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ధర తగ్గించి పాడి రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. గిట్టుబాటు ధర ప్రకటించకపోతే ఉద్యమం తప్పదన్నారు. డిసెంబర్ 2న విశాఖ డెయిరీ కార్యాలయం వద్ద మహాధర్నా చేపడతామని చెప్పారు.

పింఛన్ సొమ్ము చోరీకి యత్నం

- వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడికి యత్నించిన దుండగులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఎస్‌ఎంపురం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పైల విష్ణుపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం దాడికి ప్రయత్నించారు. ఈ ఘటన నుంచి ఆయన తృటిలో తప్పించుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి పింఛన్లు అందజేసేందుకు గాను శుక్రవారం ఎచ్చెర్లలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.29 లక్షల 63 వేలను విష్ణు విత్‌డ్రా చేశారు. ఆ సొమ్మును సంచిలో పెట్టి బైక్‌పై పెట్టుకుని ఎస్‌ఎంపురం బయలుదేరారు. ట్రిపుల్ ఐటీ సమీపంలోని రాజీవ్ స్వగృహ కాలనీ (అనమిత్ర) కాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ ఆపే ప్రయత్నం చేశారు. కుడి చేతిపై రాడ్డుతో కొట్టే ప్రయత్నం చేయగా.. ఆయన వేగం పెంచి ముందుకు సాగారు. దుండగుల దాడి నుంచి తప్పించుకుని సచివాలయానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో సీపాన హరిహరరావుకు తెలియజేశారు. అనంతరం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, దుండగులు హెల్మెట్, మాస్కులు పెట్టుకోవడంతో వివరాలు తెలియడం లేదు. స్థానికులే కావచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



దుండగుల దాడి నుంచి తప్పించుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ పైల విష్ణు

కార్గో ఎయిర్‌పోర్టు బాధితులకు సంఘీభావం

కాశీబుగ్గ: మందస మండలం రాంపురం పంచాయతీ టి.గంగువాడ గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టు రాకతో భూములు కోల్పోతున్న రైతులకు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ప్రతినిధులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించకుండా ప్రజా ఆమోదం లేకుండా ఎయిర్‌పోర్టు పేరుతో 1400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాన్ని నిజంగా అభివృద్ధి చేయాలనే తపన ఉంటే కొబ్బరి, జీడి, మునగ, మామిడి పరిశ్రమలు నెలకొల్పి ఉద్దానం ప్రాంత వాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అభివృద్ధి పేరిట పచ్చని ఉద్దానాన్ని అధ్వానం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ అధ్యక్షుడు విక్టూరి రమణమూర్తి, సంస్థ సభ్యులు కొండే సూరి, పాపారావు, శేఖర్, ఢిల్లీరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళ సంఘం సభ్యురాలు నాగమణి, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, రాష్ట్ర అమరుల బంధుమిత్రుల ప్రతినిధి ధనలక్ష్మి, ప్రజాకళ మండలి సభ్యులు చిరంజీవి, శ్రీకాంత్, కుమార్, కార్మిక సంఘం సభ్యులు కారి పురుషోత్తం, గణపతి, అమ్మ రామకృష్ణ, భూ బాధిత రైతులు గున్నయ్య, చిత్తకూర్మరావు, కొమర వాసు, లోకనాథం, తామాడ తుంభనాథం, దున్న రామారావు, బత్తిని లక్ష్మణ్, మడియా రుషి, బత్తిని మాధవరావు, దున్న హరికృష్ణ, మర్ల సంతోష్, గుంటు రామస్వామి, కీలు దుర్యోధన, మోహినమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ అధ్యక్షుడు విక్టూరి రమణమూర్తి

బైక్ షోరూమ్‌లో చోరీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పాత జాతీయ రహదారిపై ఉన్న శ్రీసాయి లలిత ఆటో ఫైనాన్స్, శ్రీ నీలమణిదుర్గ మోటార్స్ షోరూమ్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముందుగా సీసీ కెమెరాలను పగలగొట్టిన దుండగులు కంప్యూటర్ హార్డ్ డిస్క్, బీరువా పగులగొట్టి ఫైళ్లను ఎత్తుకు పోయారు. సుమారు 30 వాహనాలను మాత్రం అలాగే వదిలేశారు. యజమాని మహేష్ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ మోహనరావు పరిశీలించారు.